



వాల్మీకి జయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

ఆయన తీరే వేరు..!



అనంతపురం జలవనరుల శాఖలో ఒక డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరుగా పనిచేస్తున్న ఆ అధికారి తీరే వేరు అన్నట్టుగా ఉంది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి కాంట్రాక్టర్లు పనులు చేస్తే వాటికి సంబంధించిన బిల్లులు ఏళ్లు గడుస్తున్నా పెట్టకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో వారి సమస్యను మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ◆ జలవనరుల శాఖ కాంట్రాక్టర్ల గగ్గోలు
- ◆ ఏళ్లు గడుస్తున్నా బిల్లులు పెట్టని ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్
- ◆ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2018-19 సంవత్సరాల్లో నీరు చెట్టుకింద హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలో పనులు చేపట్టారు. ఇందులో హెచ్ఎల్‌సి అనంతపురం డివిజన్ పరిధిలో కొంత మంది కాంట్రాక్టర్లు పనులు చేశారు. 2019లో ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే పనులపై విచారణను చేపట్టింది. ఆ విచారణలో సరిగా ఉన్నాయన్న వాటికి బిల్లులను చెల్లించింది. ఈ డివిజన్ పరిధిలో సుమారు 18 పనులను పూర్తి చేశారు. కోటి రూపాయలకుపైగా విలువైన పనులను కాంట్రాక్టర్లు చేశారు. విచారణలోనూ ఇవి సరిగా ఉన్నాయని తేల్చారు. పైగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బిల్లులు చెల్లించమని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ పనులకు కూడా సదరు ఇంజినీరు బిల్లులు చెల్లింపునకు చర్యలు తీసుకోలేదు. ఈ నెలాఖరుకు ఆ అధికారి రిటైర్డు కూడా అవనున్నారు. ఆయన పరిధిలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకుండా ఇతర కారణాలతో కొర్రీలు వేస్తుండటంతో కాంట్రాక్టర్లు గ్రీవెన్స్‌లో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయినా ఆ అధికారి నుంచి ఎటువంటి స్పందనా లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డు అయితే మొత్తం బిల్లులు రాకుండా ఆగిపోయే అవకాశముందని, లక్షలు అప్పులు చేసి పనులు చేసామని గుత్తేదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంతవాహనానికి బిల్లులు

ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు కావడంతో ఆయన పనుల పర్యవేక్షణ నిమిత్తం వెళ్లేందుకు ప్రభుత్వం తరుపున వాహనం ఏర్పాటు చేస్తారు. ఆయన పర్యటన ఎక్కువగా కాలువలపైనా ఉంటుండటంతో బొలేరో వాహనం లాంటిది కేటాయిస్తారు. ఆ అధికారి మాత్రం తన బంధువుల పేరున సొంత వాపనాన్నే ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. చిన్న వాహనంలో ఫీల్డ్ విజిట్ చేయడానికి కూడా అనువుగాని వాహనం ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనంలో తిరగకుండానే బిల్లులు డ్రా చేస్తున్నట్లు సమాచారం. వాహనం ఏర్పాటు, ఈ బిల్లులపై కొంత మంది గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

మహనీయుడు వాల్మీకి

- ◆ కుటుంబ, పరిపాలనను తెలియజేసే కావ్యం రామాయణం
- ◆ రాష్ట్రస్థాయి వాల్మీకి జయంత్యుత్సవాల్లో ప్రజాప్రతినిధులు



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కుటుంబ బంధాలు, రాజ్య పరిపాలన గురించి రామాయన మహాకావ్యం ద్వారా తెలియజేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. అనంతపురం జిల్లా కేంద్రంలో వాల్మీకి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలను గురువారం నిర్వహించారు. ముందుగా నగరంలోని పవర్ ఆఫీస్ దగ్గర ఉన్న వాల్మీకి విగ్రహానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు ఎంపీలు అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారధి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, రాష్ట్ర బిసి.వెల్ఫేర్, సెక్రటరీ పోలా భాస్కర్, ఏపీ బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తదితరులు పూలమాలలు వేశారు. అనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులో మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్లో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రాసిన రామాయణం గురించి నేటి తరం పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కావ్యాన్ని రచించిన వాల్మీకి స్ఫూర్తినీయుడన్నారు. రాష్ట్రంలో వాల్మీకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రతి ప్రధాన జిల్లా కేంద్రంలో బీసీ భవనాల నిర్మాణాలను చేపడతామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లను పునరుద్ధరిస్తామని తెలియజేశారు. అనంతపురం టవర్ క్లాక్ బ్రిడ్జికి వాల్మీకి వారధిగా నామకరణం చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కోరారు. పార్లమెంట్లో చర్చించి వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎంపి బికె.పార్థసారధి తెలిపారు. వాల్మీకి జయంతి ఉత్సవాలు సందర్భంగా చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది, వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాల్మీకి వేషధారణలో బాలుడు

మున్సిపాల్టీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లాలోని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద గురువారం సత్యాగ్రహ దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ ప్రభుత్వం పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు ఉత్తర్వులు ఇదే మున్సిపాలిటీలో పనిచేస్తున్న టీచర్లకు మాత్రం వర్తింపజేయలేదన్నారు. మున్సిపల్ హైస్కూల్లో ఇప్పటికీ తగినంతమంది సబ్జెక్టు టీచర్లు లేరని మూడు నాలుగు ఐదు తరగతి లను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదని విమర్శించారు. ప్రమోషన్లు బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మునిసిపాలిటీ టీచర్లకు అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వాలన్నారు. ఇక మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో పడి ఉన్నాయన్నారు. వేతనాల నుండి మినహాయించే సొమ్ము, ఖాతాలో ఉన్న సొమ్ము అవసరాలకు వినియోగించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలను అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన పట్టించుకోలేదని విమర్శించారు. మున్సిపల్ హైస్కూలలో తగినంతమంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి పండిట్ పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబర్‌లోగా అప్‌గ్రేడ్ పోస్టులలో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒ మీనాక్షికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూతన్న, జిల్లా కార్యదర్శులు జిసి నరేష్, సి లక్ష్మినారాయణ, యుటిఎఫ్ నాయకులు నారాయణస్వామి, కృష్ణానాయక్, రమేష్, లక్ష్మయ్య, ఆంజనేయులు, రామకీష్ణ నాయక్ ,పెద్దన్న, భాస్కర్,సాయి, గణేష్,సాలప్ప, క్రిష్టప్ప, బాబు, రవీంద్ర రెడ్డి, బాబావలి, జగన్ తదితరులు పాల్గొన్నారు



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వర్షం... పంట నష్టం..

శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీ నష్టం జరిగింది. వేరుశనగ, వరి, మల్బరీ, పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. వేరుశనగ పంట తొలగించి పొలాల్లో ఉన్న వేరుశనగ కాయలు, చెట్లు పూర్తిగా తడిచిపోయాయి. వరి, ఇతర పంట పొలాల్లో నీరు నిలిచి నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో చెరువులు, కుంటలు నిండి ప్రవహిస్తున్నాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కదిరిలో ఖాద్రీ నరసింహస్వామి ఆలయంలోకి వరద నీరు ప్రవహించింది. ధర్మవరంలో చేనేత మగ్గాల్లోకి నీరు చేరాయి.

ప్రజాశక్తి యంత్రాంగం

చేనేత కార్మికుల జీవనం పై తుపాను ప్రభావం

ధర్మవరం రూరల్ : పట్టణంలోని చేనేత కార్మికుల జీవితాలపై తుఫాను ప్రభావం పడింది. మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా మగ్గం గుంతలలో నీరు చేరడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేనేత కార్మికులు మగ్గం నేయడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది. సంబందిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేనేతలను ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

పరిహారం ఇచ్చి ఆదుకోండి...

బత్తలపల్లి : నాలుగు రోజుల క్రితం పంటను తొలగించి పొలంలో ఉంచిన వేరుశనగ పూర్తిగా తడిచిపోయిందని దీంతో ఆర్థికంగా నష్టపోయామని తమకు ఆదుకోవాలని మండల కేంద్రమైన బత్తలపల్లికి చెందిన రైతు కొంకా గంగాద్రి అలియాస్ గాంధీ అధికారులను కోరారు. గురువారం పొలంలో తడిసిపోయిన పంటను చూపించి తన ఆవేదనను తెలిపాడు. బోరు బావుల కింద నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాననిఇందుకుగాను రూ. 1.50లక్ష పెట్టుబడి పెట్టానని చెప్పారు. నాలుగు రోజుల క్రితం పంటను నూర్పిడి చేశాననానరు. అయితే మరుసటి రోజు నుంచే వర్షం పడడంతో పొలంలోనే పంట తడిసిపోయి కుళ్లిపోతోందని వాపోయాడు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం దక్కకుండా పోతోందని, పశుగ్రాసానికి కూడా ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని అధికారులను కోరారు. మండలంలోని గంటాపురం, రామాపురం, బత్తలపల్లి గ్రామాల్లో సైతం పలువురు రైతులు వేరుశనగను తొలగించగా వారి పంట కూడా వర్షానికి తడిచిపోయింది. తమకు జరిగిన నష్టాన్ని ఎఒ ఓబిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని బాధిత రైతులు తెలిపారు.



కుళ్లిపోయిన వేరుశనగను చూపుతున్న బత్తలపల్లి మండల రైతు

కనంపల్లికి నిలిచిన రాకపోకలు

ధర్మవరం రూరల్ : మండలంలో పోతుల నాగేపల్లి చిత్రావతి నది బుధవారం రాత్రి నుండి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కనంపల్లె గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి భారీ వరద నీరు చేరడంతో చిత్రావతి నది ఉగ్రరూపం దాల్చింది. మరోవైపు నది వద్దకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని దిగువ గ్రామాల ప్రజలకు రైతులకు అధికారులు ముందస్తు ఆదేశాలు అందించారు.

నీట మునిగిన పంటలు

సోమందేపల్లి : మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు నీటి మునిగాయి, మండల వ్యాప్తంగా పలు చెరువులు నిండి మరువులు వెళ్తున్నాయి, వర్షాల నేపథ్యంలో పాడి రైతులు, గొర్రెల మేకల పెంపకం దారులు పశుగ్రాసం దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారు. మల్బరీ రైతులు పురుగులకు మేత అందించలేక నానా కష్టాలు పడుతున్నారు. గుడిపల్లి గ్రామ రైతు సుమారు రెండు ఎకరాలలో వేరుశెనగ పంటను పెరకవేసిన నాటినుండి వర్షం వస్తుండటంతో పంట తడిసిపోవడంతో కాయలు చేదు బారాయని గడ్డి పశువుల మేతకు ఉపయోగం లేకుండా పోయిందని బాధిత రైతు వాపోయాడు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

గుడిబండ : భారీ వర్షానికి వాగులు వంకలునిండి ప్రవహిస్తున్నాయి.దీంతో రహదారులు కోతకు గురై ఆటోలు,ద్విచక్ర వాహనదారులు తిరగాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. పలారం గ్రామం సమీపంలో ఉన్న వంకలో నీరు విపరీతంగా ప్రవహిస్తుండడంతో రహదారి మొత్తం కోతకు గురై ఆటోలు ద్విచక్ర వాహనాలు బోల్తా పడుతున్నాయి. మండల వ్యాప్తంగా అక్కడక్కడ వంకలు వాగులు నిండి పొర్లుతుండగా పలుచోట్ల చెరువులకు గండిపడి నీరు వృథా అవుతోంఇ. స్థానిక నాయకులు స్పందించి జెసిపిలతో మరమ్మతులు చేయిస్తున్నారు. చిగతుర్పి గ్రామంలో కూడా ఇటీవల చెరువుకు గండిపడి నీరు వృథాగా పోతుండగా స్థానిక మాజీ ఎంపీటీసీ భోజరాజు పంచాయతీ సిబ్బంది సహకారంతో సొంత నిధులు వెచ్చించి జెసిపిని తెప్పించి గండిని మూయించారు. అదేవిధంగా మందలపల్లి వద్రహట్టి సమీపంలో ఉన్న కల్వర్టు నీటి కోతకు గురై పూర్తిగా దెబ్బతిని ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షానికి కోతకు గురైన రహదారులను, కల్వర్టులను, చెక్ డ్యాములను మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గండిని పూడ్చిన అధికారులు

సోమందేపల్లి : మండలంలోని నడింపల్లి చెరువు తూము ప్రాంతంలో పడిన గండి పూడ్చివేతకు అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు నడింపల్లి చెరువు కూడా నిండిపోయింది. చెరువు తూము దగ్గర గండి పడినట్లు గుర్తించి గ్రామస్తుల సహకారంతో అధికారులు చర్యలు తీసుకొన్నారు. చిన్నగా లీక్ అవుతున్న చోట ఇరిగేషన్ ఏఈ రమేష్, మాజీ సర్పంచు రామాంజినేయులు, విఆర్ఎ నాగార్జున సహకారంతో ఇసుక మూటలను వేయించారు. అదేవిధంగా ఈదులబలాపురం చెరువు కట్టపై ఉన్న ముళ్ల కంపలను జేసీబీ ద్వారా తొలగించి, కట్టపై ఇబ్బందులు లేకుండా చేశారు.

పరిగి చెరువుకు మరమ్మతులు

పరిగి : కర్నాటక ప్రాంతం నుండి వరద నీరు ఉధృతంగా పరిగి చెరువుకు వస్తుండటంతో స్థానిక అధికారులతో పాటు టిడిపి నాయకులు ముందస్తుగా చెరువు మరమ్మతులకు సిద్ధమయ్యారు. మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు జెసిబిలతో చెరువు పరివాహక ప్రాంతాల్లో ముళ్ళ కంపలు తొలగించి తుముల మరమ్మతులు చేయించారు. నీరు ఎక్కడ వృథా కాకుండా మరువలకు చెక్క పలకలు అంటించారు. పరిగి మండల వ్యాప్తంగా నరసాపురం చిన్నపల్లి పైడేటి గ్రామాల నుండి రైతుల స్వచ్ఛందంగా మరమ్మతు పనుల్లో పాల్గొన్నారు. జిల్లాలో అతి పెద్ద చెరువులలో ఒకటైన పరిగి చెరువుకు వరద నీరు భారీగా వస్తున్నడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చెరుకు వచ్చే వరద నీరు పెన్నా జయమంగళి నదులలో వెళ్లకుండా చూడాలని రైతుల కోరారు.

పోలీసుల కాపలా

కొత్తచెరువు : రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, చెక్ డాములకు నీరు చేరుతున్నాయి. బుధవారం రాత్రి భారీ వర్షం రావడంతో కడప గాని పల్లి సమీపంలోని సత్యసాయి బ్రిడ్జి వద్ద ఉన్న పోలీసులు ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు అధికంగా వస్తున్నందున బ్రిడ్జి పైన నీరు వెళు తున్నాయి తెల్లారిన తర్వాత వాహనాలు వెళ్లాలని వాహనదారులకు తెలిపారు. పోలీసులు బారికేట్లు పెట్టి కొత్తచెరువు ధర్మవారానికి వాహనాలు రాకపోకలను పంపించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.



ఖాద్రీశుడి ఆలయంలోకి వర్షపు నీరు

కూలిన ఇంటి పైకప్పు

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎస్ బండ్లపల్లిలో ఇంటి పైకప్పు కూలి 50వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వీరనారప్ప తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం ఇంటి పైకప్పు కూలిందని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ఆయన చెప్పాడు. టీవీ, ఫ్యాను, ఇతర వస్తువులు ధ్వంసం అయ్యాయని దీంతో దాదాపు 50వేల రూపాయలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

అపార నష్టం

పుట్టపర్తి రూరల్ : తుఫాను కారణంగా మండలంలో వేరుశనగ, వరి రైతులకు అపార నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారి వెంకట బ్రహ్మం తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి, నిడి మామిడి, చెర్లోపల్లి, కోట్లపల్లి గ్రామాల్లో వేరుశనగ , వరి పంటలు వేసిన 31 మంది రైతులకు చెందిన 19.37 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. వేరుశనగ పంట పాదులపైనా నాలుగు రోజుల నుండి తడుస్తూ ఉండడంతో పూర్తిగా వేరుశనగ కట్టి, కాయలు తడిసిపోయాయన్నారు. అంతేకాక మండలంలోని 7.69 హెక్టార్లలో కోతకు వచ్చిన వరికి నష్టం వాటిల్లిందని, 11.69 హెక్టార్లలో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినిందని చెప్పారు. వేరుశనగ సాగు చేసిన రైతులు వర్షాలు పూర్తిగా నిలిచిపోయిన తర్వాత పంటను తొలగించుకోవాలని సూచించారు.

ఖాద్రీశుడి ఆలయంలోకి వర్షపు నీరు

కదిరి టౌన్ : కదిరిలో కురుస్తున్న వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయ్యాయి.అదేవిధంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. అలాగే పట్టణంలో పలు వీధులలో వర్షపు నీరు చేరింది. కాలువలు నిండి గొల్లమ్మ మంటపం వద్ద హిందూపూర్ ప్రధాన రహదారిలో మోకాళ్ళ లోతు పై భారీగా నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పండ్ల తోటల రైతులకు అపార నష్టం

ధర్మవరం రూరల్ : మూడు రోజులు గా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పండ్ల తోటలకు అపార నష్టం కలిగింది. ఈ వర్షాలతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన పండ్ల తోటల రైతులు వాపోయారు. రెండు సంవత్సరాలనుండి చీని చెట్లను కాపాడుకున్నానని, చివరికి పిందెలు పడి కాయలు కాసే సమయంలో ఇలా భారీ వర్షాలు వల్ల పంట చేతికి అందే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



ధర్మవరం మండలంలోని చెరువులో ప్రవహిస్తున్న నీరు



గుడిబండ మండలంలో రోడ్డుపై ఇరుక్కున్న వాహనాలు



నీటిలో నానిపోయిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు



ధర్మవరంలో మగ్గం గుంతలో చేరిన వర్షపునీరు

కదిరివాసికి ఉత్తమ డైరెక్టర్ అవార్డు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో భాగంగా ఒరిస్సా రాష్ట్రం లో కదిరి పట్టణానికి చెందిన బాదుల్లా బెస్ట్ డైరెక్టర్ అవార్డు అందుకున్నారు. భువనేశ్వర్ లోనీ జయ దేవ్ భవన్ గురువారం నిర్వహించిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో బాదుల్లాకు అవార్డు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా బాదుల్లా, జయదేవ్, పవన్ మాట్లాడుతూ ఇటీవల తీసిన 'ఇగ్నో' వెబ్ సిరీస్‌కు బెస్ట్ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. అరుదైన గౌరవం దక్కడం ఎంతో స్ఫూర్తిని అందించిందని చెప్పారు.

బత్తలపల్లి ఎస్‌ఐగా సోమశేఖర్

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి ఎస్ఐగా డి.సోమశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలో ఇంటలిజెన్స్. విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై బత్తలపల్లికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా, కర్నాటక మద్యం, నిషేధిత గుట్కాలపైన ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్యలుంటే నేరుగా తననే కలవచ్చునన్నారు. అనంతరం ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ను కలిసి బాధ్యతలు స్వీకరించినట్లు వివరించారు.

గ్రామసచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని పులేరు గ్రామపంచాయతీ సచివాలయాన్ని ఎంపీడీవో నరేంద్ర కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు స్టోర్ డీలర్ గంగాధరప్ప, టిడిపి నాయకుడు చంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శి శంకర తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని రామస్వామి తండాకు చెందిన లక్ష్మానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి హిందూపురం పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతబాయ్ మృతుని కుటుంబానికి 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

నూతన భవనంలోకి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కార్యకలాపాలు జాతీయ రహదారి సమీపాన ఉన్న నూతన భవనంలో నిర్వహించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ సాగర్ తెలిపారు నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ సంజీవప్ప, రీజనల్ మేనేజర్ రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

19న చేనేతల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

చేనేతల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19వ తేదీన పట్టణంలోని మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నటుల చేనేత నాయకులు తెలిపారు. స్థానిక ఎస్‌బిఐకాలనీలోని జయశ్రీ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టు చీరల తయారీ, వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి, జాతీయ చేనేత నాయకురాలు సంకారపు జయశ్రీ, గౌరవ అధ్యక్షులు కలవల రాంకుమార్ తదితరులు మాట్లాడారు. ఈ ఆత్మీయ సమావేశానికి చేనేత జోలి శాఖ రాష్ట్ర మంత్రి సవిత, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ రానున్నారని తెలిపారు. ధర్మవరం ప్రజలు, చేనేత కార్మికులు, వ్యాపారస్తులు తదితర సంస్థలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలా ప్రభాకర్, పల్లా నవీన్ కుమార్, గడ్డం పార్థసారథి, నీలూరి శ్రీనివాసులు, గిర్రాజు శశిధర్, గుండా పుల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన అధికారులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత నరసింహులు భార్య దుర్గమ్మ (26) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకొన్న ఐ సి డి ఎస్ సూపర్వైజర్ అనురాధ గురువారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి ఇద్దరు పిల్లలకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఉంచి వర్తించే పథకాల గురించి వివరించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌతమీ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతా

పరిగి :పరిగి పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పంచాయతీ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. గురువారం పరిగి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న నారాయణను టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా పరిగిని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. డ్రయినేజీ, తాగునీరు, వీధిదీపాలు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి లక్ష్మణరావు నాగభూషణ డిఎస్ఎల్ శ్రీనివాసులు కంకర శ్రీనివాసులు చంద్ర వైసిపి నాయకులు శివశంకర్ చంద్రారెడ్డి తదితరులు కార్యదర్శిని సన్మానించారు.

తాగునీటి పైపుల లీకేజీలపై దృష్టి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో ఎక్కడ తాగునీటి పైపులు లీకేజీ జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ టెలిఫోన్ కార్యక్రమం ద్వారా అధికారులకు దిశ దశ నిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. డయేరియా వ్యాధి రాకుండా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే గ్రామంలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. నీరును వేడి చేసి తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరా విభాగాల అధికారుల గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య సేవలపై ప్రతిరోజు నివేదిక అందజేయాలని తెలిపారు. జిల్లాలో అమరాపురం, ధర్మవరం, ఆముదాలగుంట, పెనుగొండ, చెరువులలో నీటి సామర్థ్యం గురించి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో ఎస్ఎస్ గేటు ,పుట్టపర్తి, ధర్మవరం, వెల్దుర్తి, మడకశిర, ఆగలి, మండలాల ప్రధాన కేంద్రాలలో కల్వర్టు పనులు పూర్తిచేయాలని, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పర్యవేక్షణలో ఆస్తి నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు, డిపిఒ ఆధ్వర్యంలో శానిటేషన్ పై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఆదేశించారు, 104, 102, 108, వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. భారీ వర్షాలలో ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా, నదీ పరివాహక ప్రాంతాలలో ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవోలు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, జిల్లా వైద్య శాఖ అధికారి, డిసిహెచ్ఒ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, డీఎస్ఒ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

మండల పరిధిలోని బూదిలి వద్ద ఉన్న కీయా అనుబంధ సంస్థ సాడిల్స్ సీట్ కవర్ ఫ్యాక్టరీ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో ఉన్న దాదాపుగా 650 మంది కార్మికులకు బోనస్ సగమే ఇచ్చారని సిఐటియు నాయకుల వద్ద వాపోయారు. దీంతో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కన్వీనర్ కమల్‌బాష కార్మికులతో కలిసి ఫ్యాక్టరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వారిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ కార్మికుల సమస్యలను సిఐ దృష్టికి తీసుకువచ్చారు. ఫ్యాక్టరీలో కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, భోజనం నాణ్యతగా లేదని అన్నారు. గతంలో కార్మికులందరూ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేపట్టారని గుర్తు చేవారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు హెచ్ఆర్ ఉమేష్ నిర్లక్ష్యంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానికంగా ఉన్న కార్మికులకు అతి తక్కువగా రూ 9 వేల నుండి రూ 11వేల లోపు వేతనం ఇస్తున్నారని బీహార్, బెంగాల్, ఉత్తర ప్రదేశ్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు రూ 14 వేల రూపాయలు ఇస్తున్నారని చెప్పారు. స్థానికంగా ఉన్న కార్మికులతో శ్రమదోపిడీ చేయించుకుంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మూడు రోజుల లోపు మా సమస్యలు తీర్చకుంటే ఫ్యాక్టరీ ఎదుట నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకుల, కార్మికులు

అత్యాచార బాధితులకు ఆర్థికసాయం అందించాలి : వ్యకాసం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

చిలమత్తూరు మండలంలో సామూహిక అత్యాచారానికి గురైన వలస కార్మిక కుటుంబాలకు జీవన భీతి , ఆర్థిక సహాయం కోటి రూపాయలు ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆసంగం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షతన గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌డిఒ ఆనంద్ కుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందే తప్ప బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోక పోవడం దుర్మార్గమని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శలకు పరిమితమయ్యారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సామూహి సామూహిక అత్యాచార బాధితులకు జీవన భృతి కల్పించేందుకు కోటి రూపాయలు ఆర్థిక సహాయం చేసి ,వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేవారు. కనీస రక్షణ సౌకర్యాలు కల్పించని పారిశ్రామిక యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకుని బాధితులకు నమ్మకం కలిగే విధంగా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలం నాగేపల్లి వద్ద వెలసిన హజరత్ పీర్ భక్తర్ వలి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దర్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ముక్తియర్, శ్రీనివాసరెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన గంధోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. ఈ సందర్భంగా పెనుగొండ బాబయ్య స్వామి వంశస్థులు అబ్దుల్ రెహమాన్ సమక్షంలో గంధాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షులు ముక్తియార్ మాట్లాడుతూ, ఇస్లామిక్ క్యాలెండర్ మేరకు ప్రతి సంవత్సరం గ్యార్మి నెలలో 11వ రోజున గందోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు షరీఫ్, వెంకటరమణప్ప, సమీవుల్లా, నరసింహా, సందీప్, ఆదిరామారెడ్డి, కిష్టప్ప, బాబా జాన్, ఆహలే సున్నతుల్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌలతో పాటు పట్టణ ప్రముఖులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



గంధంతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - మడకశిర



పార్టీలోకి చేరిన వారితో మాజీ ఎమ్మెల్సీ గుండుమల

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఎస్‌కె. రాజేష్, మేస్త్రి తలారి ఈశ్వరప్ప ఆధ్వర్యంలో నాగేంద్ర, రాము, కె జగన్, ఏ కార్తిక్, నరేంద్ర కుమార్, సాయి కిషోర్, హేమంత్ కుమార్, మారుతి, మెట్ట బండప్ప, జయరామప్ప, అభి, నాగరాజు, అశోక్,అరుణ, లావణ్య, గిరిజ, వనజ, లక్ష్మీదేవమ్మ, అశ్వత్తమ్మ, గంగమ్మ, బ్రహ్మాచారి,రాము, నాగరాజు,, నంజండప్ప,భాగ్యమ్మ, హరి రెడ్డితో పాటు 60 కుటుంబాలకు చెందిన వారు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత తిమ్మరాజు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు

చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి క్ష గోరంట్ల

శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. శ్రీక్రిష్ణదేవరాయల 495 వ వర్ధంతి సందర్భంగా గోరంట్ల మాధవరాయల గుడిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మైనాస్వామి మాట్లాడారు. విజయనగర సామ్రాజ్యమంతటా ఆలయాలను నిర్మించడం -విస్తరించడం ద్వారా ధర్మ పరిరక్షణకు విజయనగర ప్రభువు ఎంతగానో పాటుపడ్డారని అన్నారు. గుడి కేవలం భక్తి మార్గానికి మాత్రమే కాకుండా పరిపాలన కేంద్రంగా, విద్యాలయంగా, వైద్యాలయంగా ఉపయోగపడినట్లు ఆధారాలతో సహా మైనాస్వామి వివరించారు. శాసనాల గురించి-అందులోని అంశాల గురించి సభికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళి

కేంద్రమంత్రిని కలిసిన కదిరి ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

న్యూఢిల్లీ కేంద్ర మంత్రివర్గ కార్యాలయంలో కేంద్ర సాంస్కృతిక పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌ను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం కలిశారు. ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కందికుంట తెలిపారు.



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

అందరికీ ఉచిత ఇసుక : మంత్రి సవిత

ప్రజాశక్తి- పెనుకొండ

అందరికీ ఉచిత ఇసుక అందిస్తామని ఉచిత ఇసుక విధానానికి సిఎం చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నరని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సొంతానికి ఎంత ఇసుకైనా ఉచితంగాతవ్వుకోవొచ్చు అని అన్నారు. ఎవ్వరికీ పైసా చెల్లించకుండా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లొచ్చు అన్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై తీసుకెళ్లే ఇసుకను అధికారులు అడ్డుకోవద్దని అని జరిమానాలు విధించడం, ట్రాక్టర్లు సీజ్ చేయడం వంటి పనులు చేయొద్దని అని ఆమె సూచించారు. ఇసుకను బ్లాక్ మార్కెట్ అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆన్ లైన్ బుకింగ్ విధానం కొనసాగుతుందని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం



కేరళ రాష్ట్ర ప్రభుత్వ తరహాలో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లిలో తీర్మానం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టే వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకడం లౌకిక రాజ్యాంగాన్ని, సమానత్వాన్ని సార్వభౌమత్వాన్ని, మతాల కులాల మధ్య ఐక్యతను, విఘ్నం కల్గించడమే అని అన్నారు. పూర్వీకులు ఆయా సామాజిక తరగతుల అభివృద్ధికి, అల్లాహ్ పేరుతో చేసిన వక్ఫ్ భూములు, స్థలాలు చిర,చరాస్తులను, అన్యుల ఆక్రమణ, అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల నిర్వహణ కమిటీల పర్యవేక్షణలో ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి వాటిపై వచ్చే ఆదాయాలను వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయకపోతే ప్రజలను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి చేసేలా మైనార్టీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామనిహెచ్చరించారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

ప్రజాశక్తి - సోమందేపల్లి



నారాయణప్ప (ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని మాగే చెరువు గ్రామంలో తేనెటీగల దాడిలో రైతు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు బంధువులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రైతు పెద్దింటి నారాయణప్ప (64) గురువారం ఆవుల మేపడానికి సమీప పొలంలోకి వెళ్లాడు. అక్కడున్న పొదల్లోకి ఆవులు వెళ్లగా పొదలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా పైకి లేచి నారాయణప్పపై దాడి చేశాయి. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన నారాయణప్పను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణప్ప మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కొడుకు ఇద్దరు కూతుర్లు ఉండగా కొడుకు కరోనా రెండవ వేవ్‌లో మృతిచెందాడు. భార్య అంజనమ్మ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఓబులదేవరచెరువు

గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. బెల్ట్ షాపుల నిర్వహణకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ఎవరైనా బెల్ట్ షాప్ నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



జానకీరామయ్య ఘాట్ వద్ద మాజీ మంత్రి నివాళి

జానకిరామయ్య వర్ధంతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి సోదరుడు జానకిరామయ్య 21 వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి నగర పంచాయతీలోని గణేష్ సర్కిల్ సమీపంలో ఉన్న జానకీ రామయ్య ఘాట్ కు వెళ్లి నివాళులర్పించారు. సత్యసాయి జిల్లా సాధనకు ఆర్ .జానకీ రామయ్య ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపాలిటీ నగర పంచాయతీ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - సోమందేపల్లి

మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు టిడిపి హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నీరుగంటి చంద్ర ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేవారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని తెలుగుదేశం నాయకులు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మారుతీ నగర్‌కు చెందిన బోయ శంకర రక్తప్రసరణ సరిగా కాకపోవడంతో వైద్యులు కాలు తీసేసారు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. అదేవిధంగా అదే కాలనీలో నివాసముంటున్న చేనేత కుటుంబానికి చెందిన చంద్రకళ చక్కెర వ్యాధి అధికం కావడంతో వేళ్ళు తీసివేశారు. దీంతో ఆ కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం నాయకులు వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తూ ప్రభుత్వం ద్వారా సహాయం అందించడానికి అధికారులతో సంప్రదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద కోడి పల్లి నరసింహమూర్తి, చెన్నాపురం అంజి, డీలర్ పెద్ద కోడి పల్లి మురళి, నీరు గంటి అశోక్, మద్దిలేటి, డివి ఆనంద్, మోహన, పూజారి మురళి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడిగెరలో పొలం పిలుస్తోంది

అగళి : మండలంలోని బ్యాడిగెరలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో శేఖర్ నాయక్ పంటసాగుపై రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ సుమ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా 1, 2 తరగతులు బోధించు ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని ఎస్ టి యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1,2 తరగతులు బోధించు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెంపొందించే ఆలోచనతో జ్ఞాన ప్రకాశ్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా మొదటి విడత ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణా తరగతులను అక్టోబర్ 21 నుండి 26 వరకు శ్రీ సత్యసాయి, నంద్యాల జిల్లాల ఉపాధ్యాయులకు హిందూపురంలోని బిట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు బోధనకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం వలన మరిన్ని రోజులు బోధనకు దూరమయ్యే పరిస్థితి ఉన్నదని తెలిపారు. రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహణ వలన ఉపాధ్యాయులు బోధనకు దూరమవ్వడమే కాక అనారోగ్య సమస్య ఉన్న ఉపాధ్యాయులు, మహిళలు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్న ఉపాధ్యాయులు ఇతరత్రా సమస్యలున్న వారు శిక్షణలో పాల్గొనడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ రద్దుచేసి ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రైల్వేరోడ్డు విస్తరణకు అడుగులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రైల్వేరోడ్ విస్తరణకు మళ్లీ అడుగులు పడ్డాయి. రోడ్డుకు అడ్డంగా ఉన్నా భవనాల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ కూడలి నుంచి గతంలో ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా మున్సిపల్ అధికారులు భవనాలు, దుకాణాలను మూడు రోజుల నుంచి తొలగిస్తున్నారు. కొంత మంది తమ దుకాణాలను సొంతంగా తొలగిస్తుండగా.. మిగిలిన వాటిని మున్సిపల్ అధికారులు దగ్గరుండి జెసిబిలను ఏర్పాటు చేసి తొలగిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఒకటైన రైల్వేరోడ్ నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీన్ని విస్తరించాలని గత వైకాపా ప్రభుత్వంలోనే పనులు ప్రారంభించారు. నంది కూడలి నుంచి గరిడి గణేశ్ విగ్రహం ఏర్పాటు వరకు దాదాపు 85 శాతం భవనాలు తొలగించడంతో పాటు మురుగు కాలువను సైతం నిర్మించారు. రహదారి విస్తరించాలంటే ప్రయివేటు భవనాలు తొలగించాల్సి ఉన్నందున వారికి బాండ్ల రూపంలో సాయం అందించటంలో కొంత జాప్యం చోటు చేసుకొంది. ఈ సమయంలోనే ముగ్గురు కమిషనర్లు మారడంతో రహదారి విస్తరణ పనుల్లో మరింత జాప్యం జరిగింది. టిడిపి అధికారంలోకి వచ్చిన అనంతరం దీనిపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ప్రస్తుత కమిషనర్ సంగం శ్రీనివాసులు సంబంధిత భవనాల యజమానులతో సంప్రదింపులు జరిపి తొలగింపు పనులు చేపట్టారు. రహదారి నిర్మాణం జరిగితే దీర్ఘకాలంగా పట్టణ వాసులు పడుతున్న ఇబ్బందులు తొలగి రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా ఉన్నా భవనాలను తొలగిస్తున్న దృశ్యం

భావితరాలకు మార్గదర్శకుడు వాల్మీకి



వాల్మీకి విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్



హిందూపురంలో జ్యోతులతో ర్యాలీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నేటి తరానికే కాకుండా భావితరాలకు వాల్మీకి జీవితం మార్గదర్శకమని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, మాజీ మున్సిపల్ చైర్మన్, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు పిసి. గంగన్న, జర్నలిస్ట్ పుల్లయ్య, వాల్మీకి సంఘం నాయకులు సుబ్బారాయుడు, రామాంజనేయులు, రాజప్ప, చంద్రశేఖర్, గంగాద్రి, సంక్షేమ శాఖ అధికారులు ఉద్యోగ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : వాల్మీకి బోధనలు ఇప్పటి సమాజానికి చాలా అవసరమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బోయగేరి లో ఉన్న వాల్మీకి విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి ఆదర్శాలను మార్గదర్శకాలుగా చేసుకుని జీవిద్దామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పార్టీ పట్టణకన్వీనర్ శ్రీరాములు, మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, శ్రీనివాసులు, రఘువీరా చౌదరి, అనసూయమ్మ, చంద్రకాంతమ్మ, షౌకత్, మాజీ సర్పంచులు అశ్వర్థ నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : రామాయణం ద్వారా ధర్మాన్ని చాటి చెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని జిల్లా ఎస్పీ వి.రత్న కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశం గొప్పతనాన్ని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తులను స్మరించుకోవాలన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని వాల్మీకులు గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సర్కిల్లో గల వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డివి ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, నరసింహమూర్తి, మండ్లి హనుమంతు, ట్రాక్టర్ శ్రీరాములు, చిన్నాపురం అంజి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయంమని వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. గురువారం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో వాల్మీకి యువసేన ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని ఈదుల ముష్టూరు, అప్రాచెరువు, రాఘవంపల్లి గ్రామాల్లోని వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల్యవంతం, ఉప్పర్లపల్లి, దంపెట్ల, పోట్లమర్రి గ్రామాల్లోనూ వాల్మీకి సోదరులు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. బత్తలపల్లిలో వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాయలసీమ ఇన్‌ఛార్జి బోయ సాంబశివ, ముష్టూరు సర్పంచి బుద్దన్న, ఉపాధ్యక్షులు అదెప్ప, లింగప్ప, అంజనేయులు, మిత్రీ నరసింహ: బొగ్గు శివయ్య, నరసింహులు, కోట్లో మనోహర్, నాగభూషణ, బత్తిని చిట్టి తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని గురువారం రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి దొనికొండ ఆనంద్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకులు శివ, నరసింహులు, ఆంజనేయ, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం బోయ వీధికి చెందిన వాల్మీకి నాయకులు బోయ నరసింహులు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు.

తలుపుల : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ముందు గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం మండల నాయకులు చిన్న నరసింహులు, వెంకటస్వామి, బాలాజీ, అరుణ, హరి తదితరులు పాల్గొన్నారు.

అగళి : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా పంచాయతీలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, వాల్మీకులు తదతరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించారు. గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం ప్రతినిధులు గ్రామస్తులు కలిసి ఈ విగ్రహ ఏర్పాటుకు కృషి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఎర్ర భాస్కర్, ఎంపీపీ రమణ రెడ్డి, దుద్దుకుంట వెంకటరమణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి లక్ష్మీనారాయణ, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న , జడ్పిటిసి లక్ష్మీ నరసమ్మ , గంగాద్రి,మాజీ సర్పంచ్ శ్రీరామ్ నాయక్ డాక్టర్ రాఘవేంద్ర వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు కదిరి బంగారు కృష్ణమూర్తి హాజరయ్యారు.

ముదిగుబ్బ : మండలంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి ఎంపీపీ గొడ్డు మర్రి ఆదినారాయణ యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు చంద్ర, నాగరాజు, రామచంద్ర, రాజేష్, గురు,జయరాం, పూల బోడమ్మా మోహన, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కృష్ణమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండల కేంద్రంలోని రామాలయంలో వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎంపిడిఒ రమణమూర్తి,టీడిపి మండల కన్వినర్ రంగారెడ్డి,డీటీ జగన్నాథ్ ,జనసేనా చిన్నా ప్రవీణ్, బీజేపీ హరీష్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా వాల్మీకి జయంతి వేడుకలను టిడిపి వైసిపి వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కొత్తచెరువు, నారేపల్లి, తలమర్ల, గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొత్తచెరువులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, రెడ్డప్ప రెడ్డి, ఎల్లప్ప, నాగరాజు, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, బళ్లారి బాబు, ఆంజనేయులు, యుగంధర్, కష్ణమూర్తి పాల్గొన్నారు

హిందూపురం : పట్టణంలోని వాల్మీకి కళ్యాణమండపంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తొలుత వాల్మీకి సర్కిల్ లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్న మార్కెట్ నుండి జ్యోతులతో బయలు దేరిన మహిళలు వాల్మీకి విగ్రహం గూండా వాల్మీకి కళ్యాణ మంటపం వరకు జ్యోతుల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బాలయ్య వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర చౌదరి, కార్యదర్శి బాలాజి, స్థానిక వాల్మీకి నాయకులు ఆకుల సూరి, రమేష్ కుమార్, న్యాయవాది శివశంకర్, విశ్రాంతి ఎస్ఐ లోకేష్, టిడిపి నాయకులు బేవినహళ్లి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రి కళాశాలలో వాల్మికి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణప్రాంతాల అభివృద్ధికే 'పల్లె పండుగ'



మడకశిరలో రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - మడకశిర

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప తెలిపారు. గురువారం మండలం పరిధిలోని యు. రంగాపురం, గుండుమల, కదిరేపల్లి గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కరియప్ప , మాజీ సర్పంచి నారాయణ గౌడ్, ఏపీవో శ్రీకాంత గౌడ్ , ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఉపాధిహామీ పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీడీవో నరసింహనాయుడు అన్నారు.. గురువారం మండలంలోని పోట్లమర్రి, దంపెట్ల, సంజీవపురం గ్రామ పంచాయతీలలో సర్పంచు అక్కిం దామోదర్, చల్లా కరుణాకర్నాయుడు, కమతం వరలక్ష్మి అధ్యక్షతన పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ నరసింహనాయుడు, ఇఒఆర్‌డి కిష్టప్ప మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా చేపడుతున్న వివిధ రకాల పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పల్లె పండుగ కార్యక్రమంలో బాగంగా మండలంలోని చింతలపల్లి, వసంతపురం గ్రామాల్లో గురువారం సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయి మనోహర్, ఎపిఒ అనిల్ కుమార్ రెడ్డి తదితరులతో పాటు నాయకులు పురుషోత్తం నాయుడు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె. పూటకుంటలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం బూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు సర్పంచి, ఎంపిటిసిలు, నాయకులు మహమ్మద్, కుమార్, భరత్ కుమార్, అంజి, గంగాధర్ , గంగులప్ప, నాగభూషణ, మౌలా, నాగమయ్య, శంకర తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి బాటలో పయణిస్తాయని ఎంపీడీవో నరేష్‌కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని దుద్దే బండ పంచాయతీ చంద్రగిరిలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠం పీఠాధిపతి దేవేందర్ రెడ్డి, నాయకులు మారుతి, చంద్రశేఖర్, ఏపీవో జయమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మల్లికార్జున, శిరీష, నిహారిక, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు అర్బన్ షెల్టర్ హోం ఉపయోగకరం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అర్బన్ షెల్టర్‌హోంఉపయోగకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం పట్టణంలోని మడకశిర రోడ్డులో సమతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అర్బన్ షెల్టర్‌హోంను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆదినారాయణ చేస్తున్న సేవల గురించి మంత్రి అభినందించారు. స్వచ్ఛంద సేవా సంస్థ 30 ఏళ్లుగా మానవ వనరుల సహజ వనరుల అభివృద్ధి కోసం పనిచేస్తోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నంద్యాల అన్నమయ్య జిల్లాలలో సంస్థ పని చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా పెనుకొండ నగర పంచాయతీలో అర్బన్ షెల్టర్‌హోంను ప్రారంభించామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, సమత స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది వెంకటేశులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

వార్డు స్థాయి నుండి పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో కమిషనర్ డిఈతో కలిసి పారిశుధ్యకార్యదర్శులు, శానిటరీ ఇన్స్ పెక్టర్ల లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాజరైన కార్మికుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అదే విధంగా వంద శాతం ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలన్నారు. వవార్డు పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్య వహిస్తే ఎవరిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్లు శంకర్, నిజాం, ఆయా సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.